# ప్రజాశక్తి

గురువారం 6 ఫిబ్రవరి 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల




బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

# విజన్-2047పై దృష్టి



- ఉగాది నుంచి అమలుకు అవకాశాలపై యంత్రాంగం అన్వేషణ
- పి-4కు అవకాశం ఉన్న రంగాలపై తర్జనభర్జనలు

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

**రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చిన ఫార్ములా పి-4ను ప్రతిష్మాత్మకంగా అమలు చేసేందుకు సన్నాహాల్లో ఉంది. ఉగాది నుంచీ పి-4 (పబ్లిక్-ప్రయివేటు-పీపుల్స్- పార్టనర్‌షిప్) విధానాన్ని అమలు చేయాలని సిఎం చంద్రబాబు జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రణాళిక శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన భవిష్యత్‌లో ఈ విధానాన్ని ఎలా అమలు చేయాలన్న దానిపై దిశానిర్దేశం చేశారు. దీంతో యంత్రాంగం దీనిపై దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాలో విజన్-2047 ప్రణాళికలను రూపొందించారు. వాటిని రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశంలోనూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పవర్ ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. ఇక దీన్ని అమలు చేయాల్సిన సమయం వచ్చింది.**

ఉగాది నుంచే అమలు చేయాలని నిర్ణయించారు. రానున్న కాలంలో ఈ విధానాన్ని అనుసరించి ప్రభుత్వం పూర్తిగా ఏ రంగంపైనా దృష్టి సారించే పరిస్థితి లేదు. నిధుల కొరత పేరుతో ప్రైవేటు-పీపుల్స్ పార్టనర్‌షిప్ విధానాన్ని ముందుకు తెస్తున్నారు. ఏ రంగంలోనైనా కొత్త పథకాలు, ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రవేటు రంగాలనుంచే పెట్టుబడులు తీసుకొచ్చే యోచనలో ఉన్నారు. ఇక జిల్లాలో ఏఏ రంగాల్లో పి4 అమలు చేయడానికి అవకాశాలున్నాయనే దానిపై ఇప్పటికే యంత్రాంగం కసరత్తు చేపట్టింది. ముందుగా టూరిజం రంగంలో ఈ విధానంతో పెట్టుబడులు ఆశించి బీచ్‌లు, పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఎవరు ముందుకు వస్తారనేదీ చూడాలి. ఈ విధానం వల్ల రానున్న కాలంలో పర్యాటక ప్రాంతాల్లోని విలువైన స్థలాలు, బీచ్‌లు లీజుల పేరుతో ప్రైవేటు వ్యక్తులపరం కానున్నాయి. ఇంకా చెప్పాలంటే పాలకపక్ష నేతలు, బడాబాబుల చేతిలోకి వెళ్లనున్నాయి. దొనకొండ, కనిగిరి సెజ్‌లలో ఇప్పటికే కొంత భూమిని సేకరించి ప్లాట్లుగా వేశారు. రిలయన్స్ సంస్థకు పీసీపల్లి మండలం, మాలకొండాపురం వద్ద బయో ఇంధనం పరిశ్రమకు భూమిని కేటాయించాలని చూస్తున్నారు. ఎవరు ఫ్యాక్టరీ పెడతామంటే వాళ్లకు భూములు అప్పగిస్తారు. ఈ రంగాల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిశ్రమ గానీ, మరేదైనా సంస్థ గానీ ఏర్పాటు చేసే పరిస్థితి కనిపించడం లేదు. దొనకొండ పరిశ్రమల కేంద్రాన్ని రాష్ట్రవిభజన తర్వాత రాష్ట్ర ప్రభుత్వమే ప్రకటించింది. ఇప్పటికీ అతీగతీ లేదు. కనిగిరి సెజ్ కూడా యుపిఎ ప్రభుత్వ హయాంలో ప్రకటించారు. దీని పరిస్థితీ ఇదే. వెలిగొండ, ఇతర సాగునీటి ప్రాజెక్టులూ పెండింగులో ఉన్నాయి. వీటికి రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించాలి. ఇక ఎన్‌ఆర్‌ఐలను ఆహ్వానిస్తున్నారు. పేదలను ఆదుకునే పేరుతో ఎన్‌ఆర్‌ఐలను ప్రోత్సహించి పెట్టుబడులు రాబట్టేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా నుంచి విదేశాల్లో ఉండే వారిపైనా దృష్టి సారించారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో ఎన్‌ఆర్‌ఐలు ఎంత మేరకు ముందుకు వస్తారనేదీ చూడాలి. పి-4 కొత్తగా తెరపైకి రావడంతో ఎన్నికలకు ముందున్న వ్యూహాలు, పథకాలు, హామీలు అన్నీ మరుగున పడ్డాయి. సూపర్‌సిక్స్ కూడా పత్తాలేకుండా పోయాయి. వాటిని పక్కదారి మళ్లించేందుకు ఇప్పుడు పి-4 విధానాన్ని తెరపైకి తెచ్చారా? లేక ప్రజల ఆస్తులు, భూములను ప్రైవేటు వారికి అప్పగించేందుకు పావులు కదుపుతున్నారా? అన్నదీ తేలాల్సి ఉంది.

# ఇది దగాకోరు బడ్జెట్

- కార్పొరేట్ శక్తులకే అనుకూలం..
- ఉపాధి హామీని నిర్వీర్యం చేశారు..
- పేదలను మరింత పేదలుగా మారుస్తున్నారు..
- రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకుల ధ్వజం
- కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తూ.. కార్మిక హక్కులను కాలరాసే దగాకోరు బడ్జెట్ అని రైతు , కార్మిక, ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, వెనుకబడిన ప్రకాశం జిల్లాకు పదివేల కోట్లు నిధులు మంజూరు చేయాలని నినదిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి చర్చి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిర్వాహకులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, ఆర్థిక విధానాలను ▶ 2లో

# నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి

'అవగాహన యాత్ర'లో కలెక్టర్ తమీమ్‌అన్సారియా

**ప్రజాశక్తి-పిసిపల్లి**

నీటి సంరక్షణతోనే సమగ్రాభివద్ధి సాధ్యమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, నీటి వనరులను కాపాడుకోవటం మన అందరి బాధ్యత అని చెప్పారు. ఈ దిశగా వాటర్ షెడ్ పథకం కింద డ్వామా ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు పెదచెర్లోపల్లి మండలం మురగమ్మి పంచాయతీలోని జంగాలపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన యాత్ర కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్, స్థానిక శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, వాటర్ షెడ్ డిప్యూటీ కమిషనర్ సాగర్ కుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసెఫ్ కుమార్, తదితరులు కూడా పాల్గొన్నారు. ముందుగా ఢిల్లీ నుంచి ఈ పథకం వినియోగాలపై కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు వీక్షించారు. అనంతరం స్థానికులను ఉద్దేశించి అతిథులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి ఈ పంచాయతీలో నీటి సంరక్షణ కోసం వాటర్ షెడ్ పథకం కింద పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన విజన్ డాక్యుమెంట్లలో కూడా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చాయన్నారు. పంటల సాగుకు, పేదరిక నిర్మూలనకు, తలసరి ఆదాయం పెంపునకు నీటి సంరక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ బాధ్యత మన అందరి పైనా ఉందన్నారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని జిల్లావ్యాప్తంగా నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.



'అవగాహన యాత్ర'లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ క్షామపీడిత ప్రాంతానికి, ముఖ్యంగా మన పశ్చిమ ప్రాంతానికి వాటర్ షెడ్ పథకం అనేది ఒక వరం అని వ్యాఖ్యానించారు. నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకుంటే మన ప్రాంతం నుంచి వలసలను నివారించవచ్చని అన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి మన ఇంటిలో ఉన్న చెట్లను వాస్తు పేరుతో నరికించి వేయటం సరికాదని చెప్పారు. మూఢ నమ్మకాలను విడనాడి శాస్త్రీయ దక్పథంతో చెట్లను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఇంట్లో వినియోగించిన నీటిని రోడ్లమీదకి వదలకుండా మన స్థలంలోనే ఇంకిపోయేలా ఇంకుడు గుంటలను తవ్వుకోవాలని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. వాటర్ షెడ్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటి బిందువును పొదుపు చేయాల్సిన ▶ 2లో

## శాసనమండలి ఎన్నికలను
# సజావుగా నిర్వహించాలి

కలెక్టర్ వెంకట మురళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

శాసనమండలి ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని సమావేశం హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యల గురించి నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా, బాపట్లలో ఎమ్మెల్సీ ఎన్నికలు 12 మండలాల్లో జరుగుతాయని చెప్పారు. ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, బాపట్ల జిల్లాకు సంబంధించి 12 మండలాల్లో ఫిబ్రవరి 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల పరిధిలోని 12 మండలాల్లో మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పగడ్బందీగా అమలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన నోడల్ ఆఫీసర్లు వారికి అప్పజెప్పిన బాధ్యతలను పారదర్శకంగా అమలు చేయాలని, జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే 12 మండలాలలో 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 24,440 మంది గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన చెప్పారు. వీరిలో పురుషులు 15,292 మంది, మహిళలు 9,150 మంది థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారని తెలియ జేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా అదనపు ఎస్.పి విఠలేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.పద్మ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, గహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వై. వెంకటేశ్వరరావు, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, రేపల్లె రెవిన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

# ఇది దగాకోరు బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

ఎండగట్టారు. కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ వర్గాలకు ప్రయోజనం చేకూర్చేదిగా ఉందన్నారు. బడ్జెట్లో వ్యవసాయరంగానికి ఎటువంటి ప్రాధాన్యత కల్పించకపోవడం ఆక్షేపణీయమని ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం యోచిస్తుందని తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ 70 శాతంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, రైతాంగాన్ని బడ్జెట్లో నిర్లక్ష్యం చేశారని చెప్పారు. కార్మిక వర్గాల ప్రయోజనం చేకూర్చే 44 కార్మిక చట్టాల స్థానే నాలుగు లేబర్ కోడ్లు ప్రవేశపెట్టడం వెనుక కుట్ర దాగుందని ఆరోపించారు. ఇది ఉపాధి హామీకి తూట్లు పొడిచే బడ్జెట్గా పేర్కొన్నారు. పిడిఎస్యు రాష్ట్ర నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ నిరుద్యోగ మరింతగా పెంచేదిగా బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.కల్పన మాట్లాడుతూ బడ్జెట్లో స్కీం వర్కర్లకు, ఆశావర్కర్లకు అంగన్వాడీలకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు ఎటువంటి కేటాయింపులు లేకపోవడం ఆక్షేపణీయమన్నారు. ఐద్వా నాయకురాలు కంకణాల రమాదేవి మాట్లాడుతూ దేశంలో నానాటికీ పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు నిలువరించేందుకు బడ్జెట్లో ఎటువంటి కేటాయింపులు లేకపోవడం విచారకరమన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే ఈ బడ్జెట్ ఉపకరిస్తుందని విమర్శించారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు వెనుకబడిన ప్రకాశం జిల్లాకు పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు ఉప్పుటూరు ప్రకాష్రావు, ఏఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎంఎస్.సాయి, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు చావలి సుధాకర్రావు, ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఆర్.మోహన్, రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కె.లలితకుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, నగర కార్యదర్శి టి మహేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, కే ఎస్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జార్జి, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆవుల సుబ్రహ్మణ్యం, సామాజికవేత్త కవి పిన్నిక శ్రీనివాసరావు, సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్ టియు, ఏఐఎఫ్టియు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి


(మొదటిపేజీ తరువాయి)

అవసరం ఉందన్నారు. స్పెషల్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీ హర్ష మాట్లాడుతూ జల వనరులను కాపాడుకుంటూ భూగర్భ నీటిమట్టం పెంపుపై ప్రతి ఒక్కరు దష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటామని, నీటి వనరులను కాపాడుకుంటామని ఈ సందర్భంగా స్థానికులతో అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన యాత్రకు జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. నీటి సంరక్షణపై విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలైన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. డ్వామా ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై నిర్వహించిన నాటక ప్రదర్శన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ భవాని హర్ష, వాటర్ షెడ్ అడిషనల్ పి.డి. వండర్ మ్యాన్, ఏ.పి.డి. చంద్రశేఖర్ రెడ్డి, మర్రిపూడి డబ్ల్యూ.సి.సి. ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేష్ కుమార్, వాటర్ షెడ్ మల్లికార్జునరావు, స్థానిక తహశీల్దార్ ఉష, ఎంపిడిఓ ప్రభాకర్శర్మ, ఈఓఆర్డి డి నాగమల్లేశ్వరి, నేరేడుపల్లి మురుగమ్మి సర్పంచ్లు పల్లా మల్లికార్జున, శుభరత్తమ్మ పాల్గొన్నారు.

## నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎకెపి కళాశాల సమీపంలోని సాయి కాలనీకి చెందిన వద్ధ మహిళలకు బియ్యం, కందిపప్పు నిత్యావసర సరుకులు అందజేశారు. పద్మ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘంటా అశోక్ బాబు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిత్యావసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్,కవిత,నవ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

## నష్ట పరిహారం అందజేత

**ప్రజాశక్తి-కొండపి**

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కొండపి మండలం దాసిరెడ్డిపాలెంనకు చెందిన కాటంరెడ్డి గురువారెడ్డి కుటుంబ సభ్యులకు మంత్రి స్వామి మంగళవారం రూ.5 లక్షల పరిహారం అందజేశారు. తూర్పు నాయుడు పాలెంలోని క్యాంపు కార్యాలయంలో గురువారెడ్డి కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ కుటుంబానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రులు స్వామికి, గొట్టిపాటి రవికుమార్‌లకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జి.రామయ్యచౌదరి, వసంతరావు, యనమద్ని వెంకటేశ్వర్లు, మునగల జాను, ముక్కు ప్రసాదు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

**ప్రజాశక్తి-చిన్నగంజాం**

మండల పరిధిలోని సంతరావూరు నాగార్పమ్మ గుడి దగ్గర అక్రమంగా మద్యం కలిగి ఉన్న మహిళను బుధవారం అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి మొత్తం 16 మద్యం బాటిళ్లు, 16 బ్రాందీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ చట్ట ప్రకారం మద్యం బాటిళ్లు కలిగి ఉండుట, రవాణా చేయటం, అమ్ముటం నేరమని ఎక్సైజ్ సిఐ శ్రీహరి తెలిపారు.

## పశుగణన వెంటనే పూర్తి చేయాలి

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

పశు వైద్య సిబ్బంది పశుగణన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఎకొండపి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి కుమార్ తెలిపారు. బుధవారం పొన్నలూరు, కొండపి, శింగరాయకొండ పశు వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోనే సిబ్బంది ప్రతి రైతు పెంచుతున్న పశువులను విధిగా నమోదు చేయాలని సూచించారు. సీజనల్‌గా పశువులకు, జీవాలకు వచ్చే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు చేయాలని సూచించారు. పశువులు, జీవాలకు షెడ్లు నిర్మించుకోనేలా రైతులకు సూచించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ, కొండపి, పొన్నలూరు మండలాల పశు వైద్యులు హాజరత్తయ, పేరయ్య, చంద్రశేఖర్, శివరామకృష్ణ, కోటేశ్వరరావు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచులను సమాన దృష్టితో చూడాలి

**ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**



సర్పంచులతో సమావేశమైన ఎమ్మెల్యే చంద్రశేఖర్

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని సర్పంచులను సమాన దృష్టితో చూడాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం యర్రగొండపాలెం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వైసీపీ సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. అయితే సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తాము గ్రామ పంచాయతీల పరిధిలో చేసిన పనులకు పంచాయతీ కార్యదర్శులు బిల్లులు చేయడం లేదన్నారు. దీంతో తాము పంచాయతీ పరిధిలో ఏదైనా పనులు చేయాలంటే బిల్లులు కావని భయమేస్తుందన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే తాడిపర్తి చంద్రశేఖర్‌ను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ప్రజలు ఎన్నుకోబడిన సర్పంచులను పార్టీలకు రాజకీయాలకతీతంగా అధికారులు అందరినీ సమాన దృష్టితో చూడాలన్నారు. వెంటనే వైసీపీ సర్పంచులు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని తెలిపారు. అలాగే నీటి సమస్య ఉన్న గ్రామాల్లో సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలను ఆదుకోవాలని తెలిపారు. దీంతో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొంత కిరణ్ గౌడ్, మాజీ ఎంపీపీ మోర్తాల సుబ్బారెడ్డి, పుల్లలచెరువు జడ్పిటిసి వాగ్యా నాయక్, సర్పంచ్‌లు ఏకుల ముసలారెడ్డి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, తమ్మినేని సత్తిరెడ్డి, నాయకులు రాములు నాయక్, లింగం రవి, బిజ్జం రమణారెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గొడుగు మస్తాన్ మృతికి సంతాపం

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**



మస్తాన్ (ఫైల్)

మండలంలోని మైనంపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, నూర్ భాషా సంఘం జిల్లా అధ్యక్షులు గొడుగు మస్తాన్ (67) మంగళవారం రాత్రి గుండెపోటుతో ఒంగోలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో మృతి చెందాడు. ఆయన మొదట కాంగ్రెస్ పార్టీలో గ్రామంలో కీలకమైన వ్యక్తిగా పనిచేశారు. తరువాత వైసీపీలో కీలకవ్యక్తిగా పనిచేస్తున్నారు. గ్రామ నీటి సంఘం మాజీ అధ్యక్షుడిగాను, మద్దిపాడు ఏఎంసీ మాజీ డైరెక్టరుగా పనిచేశారు. ఆయన ప్రస్తుత గ్రామ పంచాయతీ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రస్తుత పాలక వర్గం గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన కుమారుడు కాలేషా గ్రామ వార్డు మెంబర్‌గా పనిచేస్తున్నారు.

**నివాళులర్పించిన సీపీఎం నాయకులు**

గొడుగు మస్తాన్ మృతదేహాన్నీ పలువురు సీపీఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, మండల నాయకులు బంకా సుబ్బారావు, నెరుసుల వెంకటేశ్వర్లు, అబ్బూరి వెంకటేశ్వర్లు, గుండవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మాజీమంత్రి బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జున, ఎస్ఎన్‌పాడు, చీమకుర్తి జడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, ఆయా మండలాల వైసీపీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ దాట్ల రమణ, ఉపసర్పంచ్ జి.సుబ్బారావు, ఎంపీటీసీ ఏ.రాజకుమారి, సుబ్బారావు దంపతులు, దుంపా యలమందారెడ్డి నివాళులర్పించారు.



మస్తాన్‌కు నివాళులర్పిస్తున్న మేరుగ నాగార్జున

## వైద్యం వికటించి గర్భిణీ మృతి

**ప్రజాశక్తి-అర్ధవీడు**



మృతి చెందిన అల్లూరమ్మ

ప్రకాశం జిల్లా అర్ధవీడు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో ఏడు నెలల గర్భిణి ఇంజక్షన్ వికటించి మృతి చెందిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. పాపినేని పల్లె గ్రామానికి చెందిన మినిగా అల్లురమ్మ (43) చికిత్స కోసం వైద్యశాలలో చేరింది. సిబ్బంది సెలైన్ బాటిల్ ఎక్కిస్తుండగా వైద్యం వికటించటంతో మెరుగైన వెద్యం కోసం కంభం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఏడేళ్ల కుమార్తె ఉంది. తల్లిని కోల్పోయిన చిన్నారిని చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

## రూ.4 లక్షల నగదు చోరీ

**గుంటూరు రైల్వే పోలీసులకు ఫిర్యాదు**

**ప్రజాశక్తి-రాచర్ల**

రాచర్ల మండలం, జెపీచెరువు గ్రామానికి చెందిన బూరుగుల కమాలయ్య గుంటూరు మార్కెట్ యార్డ్‌లో మిర్చి అమ్మగా వచ్చిన రూ. 4 లక్షలతో ఇంటికి బయలుదేరాడు. మంగళవారం రాత్రి గుంటూరు రైల్వే స్టేషన్లో గిద్దలూరు వచ్చే రైలు ఎక్కుతున్నాడు. ఆ సమయంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో దొంగలు కమాలయ్య భుజానికి ఉన్న సంచిని కత్తిరించి సంచిలోని రూ.4 లక్షలు అపహరించారు. రైలు ఎక్కిన కమాలయ్య బ్యాగు కత్తిరించి ఉండటం, ఖాళీ బ్యాగ్ చూసుకుని షాక్‌కు గురయ్యాడు. తోటి రైతులతో గుంటూరు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసి బోరున విలపిస్తూ ఇంటికి వచ్చేశాడు. సిసి ఫుటేజ్‌లను లోతుగా పరిశీస్తున్నామని, దర్యాప్తు కోసం కమాలయ్యను గుంటూరు రావాలని రైల్వే పోలీసులు కోరారు.



పట్టుబడిన రేషన్ బియ్యంతో అధికారులు

## 90 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాశక్తి-త్రిపురాంతకం**

మండలంలోని వెల్లంపల్లి జాతీయ రహదారి 544డిపై ఆంజనేయస్వామి గుడి దగ్గరలో రోడ్డుపై బుధవారం తెల్లవారు జామున వాహనంలో తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్ ఎర్రగుంట్ల చిన్న రాయుడు ఇచ్చిన వాంగ్మూలం మేరకు త్రిపురాంతకంకు చెందిన ఇమ్మడిశెట్టి ప్రసాద్, గాయం తిరుపతిరెడ్డి, దర్శికి చెందిన ప్రకాష్‌లు అక్రమంగా సేకరించిన రేషన్ బియ్యం రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన బస్తాలను త్రిపురాంతకం ఎంఎల్ఎస్ గోడౌన్‌లో అప్పగించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, డిటి రాధాకష్ణ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

**ఎంపీపీ కిరణ్ గౌడ్**

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**



మాట్లాడుతున్న ఎంపీపీ కిరణ్ గౌడ్

యర్రగొండపాలెం మండలంలోని అన్ని పంచాయతీల్లో తాగునీరు, విద్యుత్ రహదారులు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎంపీపీ దొంతా కిరణ్ గౌడ్ అన్నారు. బుధవారం యర్రగొండపాలెం పట్టణంలో ఆయనను మండలంలోని పలు పంచాయతీల సర్పంచులు, నాయకులు కలిశారు. సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొంత కిరణ్ గౌడ్ మాట్లాడుతూ ప్రధానంగా వేసవి వస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని తెలిపారు. మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించుకోవాలని తెలిపారు. నీటి లభ్యత లేక ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సి వస్తే తెలియజేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది కూడా గ్రామాల్లో అందుబాటులో ఉండి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది ప్రస్తుత పంటల్లో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతాంగానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని చెప్పారు. విద్యుత్ అధికారులు కూడా గ్రామాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మురారిపల్లి సర్పంచ్ ఏకుల ముసలారెడ్డితో పాటు వివిధ పంచాయతీల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

## గ్రూపుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

స్వయం సహాయక సంఘాల పొదుపు గ్రూపుల వివరాలను లోకోస్ ప్రొఫైల్ యాప్‌లో పొందుపరచాలని వెలుగు ఐబీ డిపియం నరసింహారావు అన్నారు. బుధవారం యర్రగొండపాలెం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో యర్ర గొండపాలెం ఏరియా కోఆర్డినేటర్ దర్శనం దానం ఆధ్వర్యంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలల వివోఏలకు లోకోస్ ప్రొఫైల్ యాప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపియం నరసింహారావు మాట్లాడుతూ పొదుపు మహిళల ఆర్థిక లావాదేవీలు మొత్తం లోకోస్‌లో శాస్వితంగా ఉంటుందన్నారు. గ్రామ సంఘాలలో ఉన్న పొదుపు గ్రూపుల మహిళలకు సంబంధించిన నెలవారిగా కట్టే పొదుపు, తీసుకున్న రుణాలు, గ్రూపు గ్రేడింగ్, మొబైల్ బుక్ కీపింగ్, ఆర్థిక లావాదేవీలు ఇలా అన్ని రకాల ట్రాన్‌సెక్షన్ లోకోస్ ప్రొఫైల్ ద్వారానే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యర్ర గొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురంతాకం ఏపియంలు పి శ్రీనివాసరావు, ఎన్ వెంకటయ్య, ఎడ్వర్డ్, ఎల్‌సి వెంకిరెడ్డి, సీసీలు ఇబ్రహీం, నాగయ్య, జ్యోతి, డేవిడ్ మండల సమాఖ్య లీడర్లు, వివోఏలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి

**ప్రజాశకి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ స్వరూపా అధ్యక్షతన ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ జీవితాన్ని ప్రభావితం చేస్తుందని తెలిపారు. ఈదశ ఎన్నో ఒడిదుడుకులకు లోనవుతుందని చెప్పారు. ఈ వయసులో వేసే అడుగులు ఉన్నత స్థితికి చేరుకుంటారో లేదో నిర్ధారణ జరుగుతుందన్నారు. వచ్చిన అవకాశాలు ఉపయోగించుకోవాలని చక్కగా చదువుకోవాలని వివరించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 మల్లు నాయక్, జడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పిచ్చారావుతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు బ్యారెన్లు దగ్ధం

**సుమారు రూ.4.5 లక్షల ఆస్తి నష్టం**

**ప్రజాశక్తి-కొండపి**



దగ్ధమవుతున్న బ్యారెన్‌లు

రెండు బ్యారెన్‌లు దగ్ధం అయిన సంఘటన కొండపి మండలంలోని చోడవరం గ్రామంలో చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. చోడవరం గ్రామానికి చెందిన బి.అరుణ, బి.ఆంజనేయులు, బి.శ్రీవాణిలను చెందిన రెండు బ్యార్నీలలో అల్లిక కర్ర జారి మొద్దుగొట్టంపై పడడంతో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు కొండపి అగ్నిమాపక కార్యాలయంను సమాచారం ఇవ్వడంతో వెంటనే సిబ్బంది మంటలను అదుపు చేశారు. రెండు బ్యార్నీలలో టైర్లు, క్యూరింగ్‌లో ఉన్న ఆకు, కర్రమొత్తం అగ్నికి ఆహుతయింది. సుమారు రూ. 4.5లక్షల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.




ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌టిసి సిబ్బంది

## ఆర్‌టిసి సిబ్బంది ర్యాలీ

**ప్రజాశక్తి-బాపట్ల**

వాహన చోదకులు రహదారి భద్రతలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని బాపట్ల ఆర్‌డిసి డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాత్సోవాల సందర్భంగా డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద నుంచి పాత బస్టాండ్ వరకూ రహదారి భద్రత పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రయాణ సమయంలో శ్రద్ధ వహించండి, రహదారి భద్రత పాటించండి,హెల్మెట్ ధరించండి, ప్రమాదాలు నివారించండి, ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదాలతో ఆర్‌టిసి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, యూనియన్ నాయకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## 8న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాశక్తి-అద్దంకి**

అద్దంకి కోర్టు భవన సముదాయాల వద్ద ఈనెల 8 జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి డి. నాగవెంకటలక్ష్మి తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీపడదని క్రిమినల్, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ మరియు ప్రీ లీటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చునని జడ్జి తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

## ఉపాధి పనులపై సమీక్ష

**ప్రజాశక్తి - పంగులూరు**

గ్రామాల్లో శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేసి తక్షణమే ఉపాధి పనులను ప్రారంభించాలని ఎంపిడిఒ కె. స్వరూపరాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేసి ఒక్కో గ్రూపుకు 20 నుండి 50 మందిని ఉపాధి కూలీలను రిజిస్టర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బందిపాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన

**ప్రజాశక్తి- కారంచేడు**

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ వి. వెంకట్రావు తెలిపారు. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను వారి గమ్య స్థానానికి సురక్షితంగా చేర్చాలన్నారు. ఆటోలు ఎక్కడబడితే అక్కడ నిలబెట్టరాదన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు. అనంతరం వాహనాల తనిఖీ నిర్వహించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

**ప్రజాశక్తి- సంతమాగులూరు**

అంగన్‌వాడీలు ఆటపాటలతో చిన్నారులకు విద్యనందించాలని ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. ఇసిసిఇ డేలో భాగంగా మండల పరిధిలోని వెల్లలచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ ప్రమీల, అంగన్‌వాడీలు తులసి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**కొల్లూరు :** కొల్లూరు అంగన్‌వాడీ సెక్టర్ పరిధిలో ఇసిసిఇ డే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ విజయలక్ష్మి మూడు సంవత్సరాల పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. పిల్లలు ఎదుగుదల, బరువు గ్రోత్ మానిటరింగ్ ప్రతినెలా క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారుల కోసమే లేబర్ కోడ్‌లు

### సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం. వసంతరావు

**ప్రజాశక్తి - చీరాల**




మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి ఎంవసంతరావు

కార్మికుల హక్కులను కాలరాసేలా పెట్టుబడిదారుల లబ్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం మోడీ లేబర్ కోడ్లను తీసుకొచ్చినట్లు సిఐటియు చీరాల పట్టణ కార్యదర్శి ఎం. వసంతరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నుంచి గడియార స్థంభం సెంటర్ వరకూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నట్లు తెలిపారు. కార్మిక వర్గానికి ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్మికుల హక్కులు కాలరాసి పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడానికే లేబర్ కోడ్‌లు తెచ్చినట్లు తెలిపారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే చట్టాలను అందరు వ్యతిరేకించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.సుధీర్, సత్యమూర్తి,జి. సుధాకర్, శివరాజు, జి.సుజీవన, సులోచన, వెంకటేశ్వరమ్మ, అరుణ, సంధ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ ప్రతులు దహనం

**ప్రజాశక్తి-ముండ్లమూరు**



మేదరమెట్లలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

ఇటీవల కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ పేదల బడ్జెట్ కాదని, కార్పొరేటర్ల బడ్జెట్ అని రైతు సంఘం మండల కార్యదర్శి పంట ఏడుకొండలు తెలిపారు. మండల పరిషత్ వద్ద కార్యాలయం వద్ద బడ్జెట్ ప్రతులను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ గ్రామీణ పేదలకు, వ్యవసాయ రంగానికి ఉపయోగం లేని బడ్జెట్ అని తెలిపారు. కార్పొరేటర్ అనుకూల బడ్జెట్ అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పంటలు పండిస్తూ దేశానికి తిండి పెడుతున్న అన్నదాతలను మోసం చేసే బడ్జెట్ అని విమర్శించారు. రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా వ్యవసాయ రంగానికి ఇచ్చే సబ్సిడీలు తగ్గిస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు బొడపాటి హనుమంతరావు, రైతు నాయకులు గంగినేని సత్యనారాయణ, ఉల్లగంటి వెంకట్రామిరెడ్డి. పడకపాటి ఏడుకొండలు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**మేదరమెట్ల :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆదాని ,అంబానీలకు మాత్రమే అనుకూలంగా ఉందని, పేద మధ్యతరగతి ప్రజానీకానికి అనుకూలంగా లేదని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మండల పరిధిలోని ప్రాసంగలపాడులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలోబడ్జెట్ ప్రతులను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజానీకానికి అభివద్ధి కరమైన అంశాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు ఎం. ఆంజనేయులు, కె. సుధాకర్, కె.హరిబాబు, ఎన్.జయరావు ఎస్. కోటేశ్వరరావు, యు.కోటేశ్వరరావు ,ఎన్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్వానం మేరకే శంకుస్థాపనకు వెళ్లాం

### ఇన్‌ఛార్జి మున్సిపల్ చైర్మన్ జైసన్ బాబు

**ప్రజాశక్తి - చీరాల**



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి చైర్మన్ బొనిగల జైసన్ బాబు

ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటు కోసం మాజీ మంత్రి పాలేటి రామారావు పలు మార్లు మున్సిపల్ చైర్మన్‌కు అర్జీలు ఇచ్చినట్లు మున్సిపల్‌ఇన్‌ఛార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు తెలిపారు. కౌన్సిల్‌లో ఈ అంశాన్ని ఆమోదించిన తర్వాతే ఎన్‌టిఆర్ విగ్రహ శంకుస్థాపన చేసినట్లు ఆయన తెలిపారు. శంకుస్థాపనకు ఆహ్వానించడంతో తాము, వైసిపి కౌన్సిలర్లు ప్రొటోకాల్ ప్రకారంగా హాజరైనట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం జైసన్‌బాబు మాట్లాడారు. ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు కోసం చేసిన శంకుస్థాపనను తాము రాజకీయం చేయడం లేదని తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు కౌన్సిల్లో తాము ఆమోదం తెలిపి ఎన్‌టిఆర్‌పై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్యకు,మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావుకు మధ్య రాజకీయ విషయాలతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. తాము వైసిపికి చెందినవారమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం సూచనలతో తాము పనిచేస్తున్నామన్నారు. ఎన్‌టిఆర్ అందరికీ ఆత్మీయులని అలాంటి వ్యక్తి విగ్రహ శంకుస్థాపనకు కొబ్బరికాయ కొట్టడం తమ అదష్టంగా భావించామని తెలిపారు. ఈ విషయం గురించి తెలియక వైసిపి కౌన్సిలర్లు ఎన్‌టిఆర్ విగ్రహ శంకుస్థాపన ఎలా చేస్తారంటూ అవాకులు చవాకులు పేలుతూ పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని వారి విజ్ఞానానికి వదిలేస్తున్నామన్నారు. నిజనిజాలు తెలియకుండా మాట్లాడిన వారు తమ మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకర్ రావు, బత్తుల అనీలు, కంప అరుణ, గోలి జగదీష్, బాలకష్ణ, నాయకుడు కోడూరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకుంటున్న వృత్తి నైపుణ్యా దారులు

## వృత్తి నైపుణ్య పురస్కారాలు అందజేత

**ప్రజాశక్తి- అద్దంకి**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారి ఆధ్వర్యంలో 11 మందికి వృత్తి నైపుణ్య పురస్కారాలు ప్రదానం చేశారు. సింగరకొండలోని శ్రీరామ వద్ధుల ఆశ్రమంలో బుధవారం ఈ పురస్కారాలు అందజేశారు.రొటేరియన్ అన్నంగి సుబ్బారావు మనుమడు అభిరామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, వీరవల్లి సుబ్బారావు, జ్యోతిచంద్రమౌళి, డాక్టర్ దేవపాలన, పువ్వాడ రామకోటేశ్వరావు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, అన్నంగి సుబ్బారావు,ఊటుకూరు రామ కోటేశ్వరావు, సంకా సుబ్రహ్మణ్యం, కాకర్ల వెంకటేశ్వర్లు, మన్నం త్రిమూర్తులు,నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువనేశ్వరి, పేరయ్య, రంగారావు, ఆర్‌వి. రాఘవరావు పాల్గొన్నారు.

**పురస్కారాలు అందుకున్న వారు వీరే...**

వీరేపల్లి వెంకటేశ్వర్లు,బత్తుల ఆంజనేయులు, వెంకటేశ్వరావు, సుందరరావు, కొలకలూరి నాగేశ్వరావు, పోలంరాజు మారుతీ, కోటేశ్వరరావు, శివన్నారాయణ, చెన్నుపల్లి అంజిబాబు, బడే సాహెబ్, అంబలగిరి వెంకటరావు వృత్తి నైపుణ్యపురష్కారాలు అందుకున్నారు.



మాట్లాడుతున్న ఎంపిప లలితకుమారి

## ప్రభుత్వ కార్యక్రమాల పై సమాచారం అందించాలి : ఎంపిపి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

గ్రామాలలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల గురించి తప్పనిసరిగా ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని ఎంపిపి డివి. లలితకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రజాప్రతినిధుల ద్వారా ప్రజలకు చేరితే ఫలితం ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులుకు తెలియకుండానే అధికారులు అమలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి ఎంపిటిసిలకు తెలియజేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐలవరం ఆరోగ్య ఉప కేంద్రం మరియు పాఠశాల సమీపంలో మద్యం బెల్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టి పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలో బెల్టు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్టు షాపు తొలగింపు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఎంపిపి ఆదేశించారు. తొలుత ఎంపిడిఒ ఎస్.వెంకటరమణ అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అభివద్ధి పనులపై చర్చించలేదు. వివిధ శాఖల పనితీరుపై రిపోర్టు చదివి వినిపించారు. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఎంపిపి ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి టి.ఉదయభాస్కరి, ఎంపిడిఒ ఎస్.వెంకటరమణ, వైస్‌ఎంపిపి కె.పిచ్చయ్య శాస్త్రి, ఎం. ఉషారాణి ,ఎఒ జలజ, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 6 ఫిబ్రవరి 2025



# లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

## సిఐటియు, వ్యకాసం ఆధ్వర్యంలో ధర్నా




ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

**ప్రజాశక్తి-మార్కాపురం**

కార్మిక హక్కులు హరించేటువంటి లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద, పట్టణంలోని నాయుడు బజార్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ రెండు ప్రాంతాల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లుగా అమలు చేసే దానికోసం 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాలు కోడ్, సామాజిక భద్రత కోడ్, వత్తి భద్రత ఆరోగ్యం-నేచర్ ఆఫ్ వర్క్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ కోడ్‌లతో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, పి రూబెన్, మండల నాయకులు జె.నాగరాజు, జి శ్రీనివాసులు, ఎస్.కె మహబూబ్‌బాష, జి హరి, షేక్ ఇమాంషా, అల్లూరయ్య, చెన్నయ్య, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహారభద్రతా చట్టాన్ని అమలు చేయాలి..

- నిత్యావసరాల ధరలను నియంత్రించాలి..
- ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి




సంతకాలు సేకరిస్తున్న ఐద్వా నాయకులు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం నాడు స్థానిక సత్యనారాయణపురంలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని కోరుతూ సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలతో ప్రజలు పౌష్టికాహారానికి దూరం అవుతున్నారని ఈ కారణంగా పోషక విలువలతో కూడిన ఆహారం పొందలేకపోతున్నారని అన్నారు. దీంతో 57 శాతానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవన ప్రమాణాలను పట్టించుకునే స్థితిలో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చౌక ధరల దుకాణాలు ద్వారా కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కేరళ వంటి రాష్ట్రాలలో 16 రకాల నిత్యావసర వస్తువులు చౌక ధరల దుకాణం ద్వారా ప్రజలకు అందిస్తున్నారని, ఇటువంటివి ఆంధ్రప్రదేశ్‌లో కూడా అందించాలని కోరారు. ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా నేత కె.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.అంజనీ దేవి, ఐద్వా నాయకులు జి.కళ్యాణి, ఎస్.ఇంద్ర జ్యోతి, డి.శ్రీదేవి, ఎం. అన్నపూర్ణమ్మ, కె.ఈశ్వరమ్మ, డి.శ్రీదేవి, కె.కోటేశ్వరమ్మ, కె.పద్మ, బి. ఉష, యన్.హరిణి, ఎం తులసి పాల్గొన్నారు.

# దరఖాస్తులకు గడువు పొడిగింపు

### ఎక్సైజ్ సిఐ లీలా



ఎక్సైజ్ సిఐ లీలా

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

కల్లు గీత కులాలకు సంబంధించి ప్రకాశం జిల్లాలో కేటాయించిన మద్యం షాపులకుగానూ దరఖాస్తులు సమర్పించే గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు ఒంగోలు ఎక్సైజ్ సిఐ లీలా బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10న ఒంగోలులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో కలెక్టర్ ద్వారా డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

# ఆర్టీసీని ప్రైవేటీకరించే చర్యలు వద్దు..

## ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా




చలో పార్లమెంటు ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-మార్కాపురం**

విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసి సంస్థను ప్రైవేటీకరించే కుట్ర పూరితమైన చర్యలు మానుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ మార్కాపురం డిపో కార్యదర్శి జి.శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కాపురంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 24న జరుగనున్న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ పిలుపునిచ్చారు. సిఐటియు కార్యదర్శి డికెఎం రఫీ మాట్లాడారు. ఈ సందర్భంగా చలో పార్లమెంటు కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీని ఆర్టీసీ డిపో వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా బాలాగయ్య, సిఐటియు నాయకులు నాగరాజు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.కె.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

## నేడు 'మాగుంట'కు బైపాస్ సర్జరీ

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి గురువారం చెన్నై అపోలో హాస్పిటల్‌లో బైపాస్ సర్జరీకి వైద్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ ఇటీవల ఆరోగ్య దృష్ట్యా వైద్యులు తనకు వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. ఆరోగ్య పరిస్థితి బాగా ఉండాలంటే హార్ట్ బైపాస్ సర్జరీ చేయాలని వైద్యుల బృందం సూచించిందన్నారు. ఈనెల 6వ తేదీ ఉదయం చెన్నై అపోలో హాస్పిటల్ లో బైపాస్ హార్ట్ ఆపరేషన్ చేయాలని వైద్యుల బృందం నిర్ణయించారన్నారు.

# స్మశాన స్థలం రద్దు తగదు

## ఆవాజ్ ఒంగోలు నగర కమిటీ నిరసన



ఇన్‌ఛార్జి మేయర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ముస్లిముల స్మశాన స్థలం రద్దు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆవాజ్ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాడు నిరసన కార్యక్రమం చేపట్టారు. 2021లో గత ప్రభుత్వం ముస్లిముల స్మశాన వాటిక కోసం నగరంలోని దశరాజుపల్లి రోడ్డు పోతురాజు కాలువ వంతెన పక్కన రెండు ఎకరాలు కేటాయించిన సంగతి విదితమే. అయితే కూటమి ప్రభుత్వం ఆ స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించేందుకు బుధవారం నాడు కౌన్సిల్ లో చర్చకు ప్రతిపాదించింది. ఈ ప్రక్రియను నిరసిస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆవాస్ నగర్ కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కౌన్సిల్ తీర్మానాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆవాస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ యాసిన్, నగర నాయకులు సయ్యద్ హుస్సేన్ సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు,పౌర సంఘాల సమైక్య నగర నాయకులు జి రమేష్ మాట్లాడారు. ముస్లిముల స్మశానానికి కేటాయించిన స్థలాన్ని ముస్లిములకు దక్కేలా చూడాలని, స్మశానానికి కేటాయించిన స్థలాన్ని రద్దు చేసే తీర్మానాన్ని వాయిదా వేయాలని కోరుతూ ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణకు మెమోరాండం అందించారు. ముస్లిములకు న్యాయం జరిగేలా కౌన్సిల్ తీర్మానాన్ని వాయిదా వేసేందుకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పటాన్ కరిముల్లా, ముస్లిం ఎకనమికల్ డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ వలి, జిల్లా కార్యదర్శి అక్బర్ బాషా, జిల్లా ట్రెజరర్ గౌస్ బాషా, జిల్లా నాయకులు సుబాని భాయ్, పఠాన్ మసూద్‌ఖాన్, స్థానిక నాయకులు తంబి శ్రీనివాసులు, ఎస్కే సిద్దయ్య, ఎస్.కె.పీరు, ఎస్.కె.జిలానీ, మహబూబ్ కబీరు పాల్గొన్నారు.

# ప్రతి శనివారం ప్రజాదర్బార్

- మార్కాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం
- త్వరలో 'మార్కాపురం జిల్లా' ఏర్పాటు
- వచ్చే మూడేళ్లలో 'వెలిగొండ'తో నీరందిస్తాం
- మార్కాపురం ఎమ్మెల్యే 'కందుల'



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం**

ప్రజా సమస్యలపై ఇక ప్రతి శనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా ప్రజాదర్బార్‌లో చెప్పుకోవచ్చన్నారు. మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విలేకరుల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎందరో సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, సిఎం చంద్రబాబు ఆదేశాలతో స్థానికంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు కాలేదని, ఇతర సమస్యలతో సతమతం కాకూడదనే లక్ష్యంతో ప్రజాదర్బార్ జరుగుతుందన్నారు.

మార్కాపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు తావులేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వచ్చే వేసవిలో ఎలాంటి ఇబ్బంది రానివ్వబోమన్నారు. తాగునీటి అవసరాల కోసం త్వరలో టెండర్లు పిలవబోతున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పడుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. ప్రభుత్వం జిల్లా ఏర్పాటుపై కసరత్తు చేస్తోందన్నారు. మార్కాపురం జిల్లా ఈ ప్రాంత ప్రజల కల అన్నారు. వచ్చే బడ్జెట్లో వెలిగొండ ప్రాజెక్టు కోసం రూ. 2వేల కోట్లు నిధులు ఇవ్వాలని సిఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే మూడేళ్లలో నీరందిస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాధ్యమవుతుందని చెప్పారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వబోతున్నట్లు చెప్పారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు గుంటక సుబ్బారెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, టిడిపి మండల అధ్యక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి, మున్సిపల్ 33వ కౌన్సిలర్ నాలి కొండయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ పెద్దావలి, టిడిపి నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, మయూర్ ఖాశిం పాల్గొన్నారు.




డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

# ఘనంగా 'సాయిరాం' వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలులోని సాయి ఐటిఐ కన్వెన్షన్ హాల్లో శ్రీ సాయిరాం జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కె మోహన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సతీమణి నాగ సత్యలత మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కషి చేయాలన్నారు. అనంతరం డాక్టర్ కే సీతా రామయ్య మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో న్యాయవాది నాదెండ్ల దశరథరామయ్య, కళాశాల చైర్మన్ డాక్టర్ కే అంజయ్య సెక్రటరీ కరస్పాండెంట్ కే మోహన్‌రావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నిరసన


అర్జీ ఇస్తున్న దర్శి సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-దర్శి**

బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు, ఉద్యోగులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి, మోదీ, బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమైన 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని, వాటిని రద్దు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపి డిమాండ్స్‌తో కూడిన అర్జీని డిప్యూటీ తహశీల్దార్‌కు వెంకటేశ్వర్లుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగులకు ఉన్న కొద్దిపాటి హక్కులను రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తుందని ఆరోపించారు. ఈ లేబర్ కోడ్స్ అమలు జరిగితే యూనియన్లు, కార్మికుల హక్కులు కాపాడుకోలేరని అన్నారు. సమస్యలపై సమ్మె చేసే హక్కు లేకుండా పోతుందని అన్నారు. 8 గంటల పని విధానం పోతుందని, యజమానుల ఇష్టానుసారంగా కార్మికులను దోచుకుంటారని అన్నారు. పని భద్రత లేకుండా పోతాదని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న పిఎఫ్, ఇఎస్ఐ, ఫించన్ సౌకర్యం, రిటైర్డ్‌మెంటు బెనిఫిట్స్ ఉండవని అన్నారు. లెబర్ డిపార్టుమెంటు లేకుండా కార్మిక, ఉద్యోగులను కట్టుబానిసలుగా మార్చడానికి తెచ్చిన లెబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా నిరసలు తెలుపుతున్నామని అన్నారు. మోదీ ప్రభుత్వం ఈ బిల్లులను 2025 ఏప్రిల్ 1నుంచి అమలు చేయడానికి పూనుకుంటుందని, వెంటనే ఈ బిల్లులను రద్దుచేయాలని, లేకపోతే కార్మిక, కర్షక, ఉద్యోగులంతా ఐక్యంగా సమ్మె చేయడానికి సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేబాషా, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, యోహెూషువా, కృపారావు, సుబ్బారావు, జనరాజపల్లి కాశిం పాల్గొన్నారు.

**కొనకనమిట్ల :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 3వసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ అనుకూల సంస్కరణల అమలును మరింత వేగవంతం చేసిందని సిఐటియు నాయకులు ఎ శ్రీనివాసులు అన్నారు. దానిలో భాగంగా శతాబ్దాల తరబడి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చి ఈ ఏప్రియల్ 1 నుండి అమలుచేసే చర్యలను వేగవంతం చేస్తుందని అన్నారు. అవి అమలైతే కార్మిక చట్టాల అమలు సంక్షేమంపై లేబర్ అధికారుల తనిఖీ ఉండదని అన్నారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కార్మిక సంక్షేమం ఊసేలేదన్నారు. సీంవర్కర్స్ వేతనాల పెంపుదల, ఉద్యోగ భద్రత, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు, నిధుల కేటాయింపు లేదన్నారు. రూ.10 లక్షల కోట్ల ప్రభుత్వరంగ సంస్థల వాటాలను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు దారాధత్తం చేస్తున్నదన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఎస్ఆర్‌జిఇఎస్‌కు రైతులకు ప్రయోజనం చేకూర్చే పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించిందన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకోవాలని, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, పేదల వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలను నిరసిస్తూ ఇప్పటికైనా కార్మిక అనుకూల ప్రతిపాదనలు పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఆవుల సురేష్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆరికట్ల శ్రీనివాసులు, అంగన్‌వాడి, ఆశా కార్యకర్తలు వేశపోగు రాణి, పి సునీత, పి అరుణ, పి నాగమ్మ పాల్గొన్నారు.


తహశీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# మెరుగైన సేవల కోసమే సిసి కెమెరాల ఏర్పాటు


పోలీస్‌స్టేషన్ పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ దామోదర్

**ప్రజాశక్తి - దొనకొండ**

ఎస్పీ ఏఆర్ దామోదర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ స్థలాన్ని పరిశీలించారు. ఎటువంటి ఆక్రమణకు గురికాకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ కేసుల ఫైళ్లను సమీక్షించారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగిం చుకుంటే ప్రజలకు వేగంగా సేవలందిం చవచ్చనే లక్ష్యంతో ప్రజల భాగస్వా మ్యంతో గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దొనకొండలో 120సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. దొనకొండ స్టేషన్‌కు ఎస్ఐని నియమించాలని విలేకర్ల కోరగా మూడురోజుల్లో ఎస్సై నియామకం చేపడతామని స్పష్టం చేశారు. దొనకొండలో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ బాల ఉగ్ర కుటుంబంకు ప్రభుత్వం నుండి అందాల్సిన అన్నీ బెనిఫిట్స్ అందేలా చర్యలు చేపడతామని సిబ్బందితో వివరించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతరం సీఐ, ఎస్సై హస్సాన్, బసవరాజు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**పొదిలి :** నిర్మాణంలో ఉన్న పోలీసు సర్కిల్ నూతన కార్యాలయ భవనాన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం సందర్శించారు. పనుల నాణ్యతను పరిశీలించారు. పనుల తీరును ఆయనకు వివరించారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి ఎస్ఐ వి వేమన ఉన్నారు.


సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ

# స్వయం ఉపాధి రుణాల లక్ష్యాలు పూర్తి చేయాలి


రుణాల నమోదు పరిశీలిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి - కనిగిరి**

జిల్లాలోని బీసీ, ఈబీసీ వర్గాలకు స్వయం ఉపాధి రుణాల లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని 8వ సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. స్వయం ఉపాధి రుణాల నమోదును ఎంతవరకు జరిగిందని అడిగి తెలుసుకున్నారు. బీసీ, ఓసి అభ్యర్థులకు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉంటే సచివాలయంలోనే రుణాలకు నమోదు చేయాలని కమిషనర్ డానియల్ జోసఫ్, మేనేజర్ ప్రసాద్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో బిసిలకు 31, ఓసీలకు 13, కాపులకు రెండు యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈనెల 7లోపు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని 1195 మందికి వివిధ రకాలైన స్వయం ఉపాధి యూనిట్లు, 24 మంది బి ఫార్మసీ చేసిన నిరుద్యోగులకు జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

**హనుమంతునిపాడు :** బ్యాంకుల సహకారంతో ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలను బీసీ, ఇబిసి, కాపు అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఒ కార్యాలయన్ని ఆయన బుధవారం సందర్శిం చారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఆన్లైన్ అప్లికేషన్ ఈనెల 7లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న వారి గృహాల వద్ద 8నుండి 11వరకు సమాచారం సేకరిస్తామని, తదనంతరం 12 నుండి 14 వరకు బీసీ రుణాల అప్లికేషన్లను పరిశీలన చేస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.


హెచ్‌ఎంపాడులో రికార్డులు పరిశీలిస్తున్న ఈడి

# 8 లోపు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాశక్తి - కనిగిరి**


ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కరరావు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సిఎస్ పురం మండలంలో ఒక షాపు, పీసీపల్లి మండలంలో ఒక షాపు గౌడ ఉప కులానికి, వెలిగండ్ల మండలంలో గౌడ ఉప కులానికి (గీత కార్మికులకు) కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కరరావు బుధవారం తెలిపారు. ఈ షాపులకు ఆయా మండలాల్లో ఎక్కడైనా ఏర్పాటు చేసుకునేందుకు రూ.2లక్షల రుసుం చెల్లించి ఈనెల 8లోగా దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని, అయితే ఒక షాపు మాత్రమే కేటాయించ నున్నట్లు తెలిపారు. ఈనెల 10న ఒంగోలులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్ వద్ద లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రాలో గెలుపొందిన వారికి అదే రోజు షాపులు కేటాయించనున్నట్లు తెలిపారు. 2024-25కు గాను రూ.18.33లక్షలు మాత్రమే లైసెన్స్ ఫీజు ఉంటుందని, 2025-26కు గాను రూ.30.25 లక్షలులు ఉంటుందని అన్నారు. జిల్లాకు చెందిన గౌడ కులస్తులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే సప్లిమెంటరీ క్యాస్ట్ సర్టిఫికెట్ కంపల్సరిగా తీసుకొని వలసి ఉంటుందని తెలిపారు.


మాట్లాడుతున్న తాళ్లూరు ఎంఇఓ జి సుబ్బయ్య

## మోడల్ పాఠశాలలపై అవగాహన

**ప్రజాశక్తి-తాళ్లూరు**

స్థానిక ఎంఇఓ కార్యాలయంలో 117 జీఓ రద్దు, మోడల్ పాఠశాలల ఏర్పాటు గురించి ప్రధానోపాధ్యాయులకు అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ జి సుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మోడల్ పాఠశాలలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేస్తుందని, ప్రధానోపాధ్యాయులు వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఓ2 ఎల్ సుధాకర్, ఇన్‌చార్జి ఎంపిడిఓ హనుమంతరావు, ఇన్‌చార్జి తహశీల్దార్ ఇమ్మానియేల్‌రాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆధార్ సెంటర్ తనిఖీ చేస్తున్న జడ్‌పి సిఇఓ చిరంజీవి

## గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

**ప్రజాశక్తి-సిఎస్.పురం**

గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఉద్యోగులు సహకరించాలని జిల్లా పరిషత్ సిఇఓ బి చిరంజీవి కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అందులో భాగంగా కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. సిఎస్ పురంలోని సచివాలయాలను సందర్శించి అక్కడ పాలన సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. ఎవరికి ఇబ్బందులు జరగకుండా ఆధార్ సెంటర్‌ను నిర్వహించాలని సూచించారు. సచివాలయ రికార్డులను పరిశీలించి మిస్సింగ్ సిటిజన్స్ రిపోర్టుపై విచారణ చేశారు. ఉద్యోగులందరూ ప్రజలకు అందుబాటు లో ఉండాలని తెలిపారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఎంపిడిఓ రంగసుబ్బరాయుడు, కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.


ఆధార్ నమోదు కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

## ఆధార్ సర్వర్ పనిచేయక అగచాట్లు

**ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్**

ఆధార్ సర్వర్ సరిగా పనిచేయక పోవడంతో ఆధార్ నమోదు కోసం వచ్చిన ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సిఎస్‌పురంలోని 1వ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఆధార్ నమోదు కోసం ప్రతిరోజు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వస్తుండడంతో కేంద్రం నిర్వాహకులు పరిమిత సంఖ్యలో టోకెన్లు ఇచ్చి ప్రజలు ఇబ్బంది పడకుండా ఆధార్ నమోదు చేస్తున్నారు. అయితే బుధవారం సర్వర్ సక్రమంగా పనిచేయక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**ప్రజాశక్తి -పొదిలి**

మండలంలోని కంభాలపాడులో విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన బసిరెడ్డి సుబ్బలక్ష్మమ్మ (76) బుధవారం మృతి చెందారు. బొబ్బర్లు పంట కోసేందుకు కూలీలను తీసుకొని పొలానికి వెళ్ళింది. స్థానిక వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందినట్లు సమాచారం.

# నత్తనడకన నిర్మాణం

- ఏళ్ల తరబడి పూర్తికాని అంగన్‌వాడీ భవనాలు
- శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోని అధికారులు



పెదపాలెంలో అసంపూర్తిగా ఉనన అంగన్‌వాడీ భవన నిర్మాణం

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

గతంలో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో మండలంలో 35 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొన్ని భవనాల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన వాటి నిర్మాణం వివిధ దశలో నిలిచిపోయాయి. వాటిని గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో అసంపూర్తిగా నిర్మించిన భవనాల్లో చెట్లు పెరిగిపోయాయి. పాములు సంచరిస్తున్నాయి. దీంతో సమీప ప్రాంతంలోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. భట్టిప్రోలు బండలం పెద్దపులివ్వరు గ్రామపంచాయతీ పరిధిలోని పెదపాలెం గ్రామం, జిలుగువారి పాలెం, కోళ్లపాలెం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు నిర్మాణం స్లాబ్ దశలో నిలిచిపోయింది. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాల భవనాలపై దష్టి సారించింది. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఐలవరం, అద్దేపల్లి, భట్టిప్రోలు, ఇతర గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం జగనన్న కాలనీల్లో స్థలాలను కేటాయించింది. భవన నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వ పాలనలోనైనా అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణానికి శ్రీకారం చుడతారని ఆశించినా అది ఇప్పట్లో నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అర్ధాంతరంగా నిలిచి పోయిన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం గురించి పంచాయతీరాజ్ శాఖ ఎఇ రామచంద్రరావును వివరణ కోరగా ప్రభుత్వ నుంచి ప్రత్యేక నిధులు మంజూరైతే నూతన భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ వివిధ దశల్లో ఆగిపోయిన పలు భవనాలకు మండల పరిషత్తు నిధుల నుంచి కొంత మేర నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆనిధులతో స్లాబ్ దశలో ఉన్నవాటికి స్లాబ్‌లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

## జ్యోతయ్యకు మంత్రి గొట్టిపాటి నివాళి

**ప్రజాశక్తి- అద్దంకి**



నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశ్రాంత ఆర్మీ ఉద్యోగి పంతంగి జ్యోతయ్య అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం సందర్శించి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రజాసేవలో ముందు వరుసలో నిలబడే పంతంగి జ్యోతయ్య మృతి వారి కుటుంబ సభ్యులతో పాటు సమాజానికి తీరని లోటని తెలిపారు. నివాళు లర్పించిన వారిలో సందిరెడ్డిశ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, టిడిపి నాయకులు, రోటరీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## దాతల సహకారం అభినందనీయం

**ప్రజాశక్తి-బాపట్ల**



దాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని బాపట్ల ఎవివి హైస్కూల్ ప్రధానో పాధ్యాయు రాలు ఎడ్ల సత్యవతి తెలిపారు. పాఠశాలకు స్టీలు బల్లలు, స్టీలు మెష్‌లు బహూకరించిన పాఠశాల పూర్వ విద్యార్థి జి. ప్రకాష్, ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులు కె. కళ్యాణి ,ఐ. శ్రీనివాసరావును బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు కె. గంగాధర్, కరస్పాండెంట్ పి .రఘురాం, ఉపాధ్యక్షుడు బి. హరినాధ మురళి, సంయుక్త కార్యదర్శి కె.మురళీధర్, కమిటీ సభ్యులు టి. సుబ్బారావు దీక్షితులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి-అద్దంకి**

మొక్కజొన్న పంటలో రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మండల పరిధిలోని కొటికలపూడి, కుంకుపాడు గ్రామాలల్లో పొలం పిలు స్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రబీసీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో రెండో దఫా ఎరువులు వేసేటప్పుడు పొటాష్ ఎకరాకు 25 కేజీల చొప్పున పిచికారీ చేయాలన్నారు. తద్వారా గింజ బరువు మరియు నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎస్. దీప్తి, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మి తులసి, హనుమంతరావు, గాలం శ్రీను పాల్గొన్నారు.

**పర్చూరు :** శనగ పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎఒ రామ్మోనరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బోడవాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎరువాక కేంద్రం సైంటిస్టులు, రేజినల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్ సైంటింస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరువాక సమన్వయ కర్త డాక్టర్ బాలమురళీధర్ నాయక్ మాట్లాడుతూ శనగలో పంట మార్పిడి విధానం ద్వారా ఎండు తెగులు, వేరుకుళ్ళు తెగులును నీవారించ వచ్చునని తెలిపారు. సైనిస్టు డాక్టర్ డాక్టర్ కామాక్షి మాట్లాడుతూ శనగ పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ రత్నకుమారి, విఎఎఆదిలక్ష్మి, జెడ్‌బిఎన్ ఎఫ్ స్టాఫ్, రైతులుపాల్గొన్నారు.




చెరుకుపల్లిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

**కారంచేడు :** మండల పరిధిలోని జరుబులవారిపాలెం, నాయుడువా పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సుధీర్‌బాబు రైతులకు కలిసిశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వాతావరణంలో మార్పు కారణంగా శనగలో పూత రాలుతున్నట్లు తెలిపారు. దాని నివారణకు ప్లానోఫిక్స్ లేదా కాంటాఫ్ ప్లస్ పిచికారీ చేయాలన్నారు. పొగాకు పంటలో కాండం తొలుచుపురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ ఎకరాకు 50 మిల్లీలీటర్ల వంతున పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎటిఎం హారిక , కిషోర్, గ్రామ వ్యవసాయ సహాయకుడు, రైతులు పాల్గొన్నారు.

**వేమూరు** : మండల పరిధిలోని కుచ్చర్లపాడు, వరాహపురం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సునీత పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. జొన్న మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా భట్టిప్రోలు మండలం ఓలేరు ,పెదలంక గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ కె. ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు

**చెరుకుపల్లి :** రైతులు ఈకేవైసీ,ఈ క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ అవ్వారు మహేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని చెరుకుపల్లి, గుల్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మినుములో పల్లాకు తెగులు కనిపిస్తుందన్నారు. దాని నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

**రేపల్లె :** మండల పరిధిలోని గుడికాయ లంక, రేపల్లె అర్బన్ గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ విజయబాబు మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్ విస్తరణకు శ్రీకారం

**ప్రజాశక్తి - పంగులూరు.**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెం గిరిజన కాలనీకి విద్యుత్తు లైన్ ఏర్పాటు పనులను అధికారులు శ్రీకారం చుట్టారు. రూ.2,70,000 రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు అద్దంకి విద్యుత్ ఇఇ మస్తాన్రావుఉత్తర్వులు జారీ చేశారు. గతంలో స్థానిక రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ సమీపంలో నివసించే12 గిరిజన కుటుంబాలకు బొమ్మనంపాడు వైపు వెళ్లే రోడ్డు ప్రక్కన ప్రభుత్వం నివేసిన స్థలాలు మంజూరు చేసింది. గిరిజనులు అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో దూరంగా ఉన్న విద్యుత్తు లైన్ వద్ద నుంచి వెదురు బొంగులు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. గత నెల 18న ఆర్‌ఇ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను గిరిజనులు కలిసి తమ కాలనీకి విద్యుత్ లైన్ లేదని అందువల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వివరించారు. గిరిజనుల సమస్యను గుర్తించిన మంత్రి రవికుమార్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధి కారులను ఆదేశించారు. అందులో భాగంగా అధికారులు విద్యుత్తు లైను విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.

## ముగిసిన వర్క్‌షాపు

**ప్రజాశక్తి-వేటపాలెం**

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆర్‌డినోపై మూడు రోజులపాటు వర్క్‌షాపు విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణ రావు బుధవారం తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం(ఇఇఇ) విభాగంలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో ఆర్‌డినో అప్లికేషన్స్‌పై మూడు రోజుల పాటు వర్క్ షాపును నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.జగదీశ్‌బాబు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో తాడేపల్లి చెందిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఉమామహేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ వర్కషాపులో ఆర్‌డినో స్టాఫ్‌వేర్ అప్లికేషన్స్ ఎలా ఉపయోగిస్తారనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇఇఇ విభాగాధిపతి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎల్‌డిఆర్, ఎల్‌ఎల్‌డి అల్ట్రా సోనిక్, సర్వోమోటార్, హెరీమ్ ఆటోమేషన్ వారు ఆర్‌డినోపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం వాటిపై ప్రయోగాలను నిర్వహించినట్లు తెలిపారు. ఆర్‌డినోపై అవగాహన పెంపొందించుకోవడం వల్ల వివిధ పరిశ్రమలలో పనులను సమర్ధవంతముగా నిర్వహించవచ్చునని ఆయన తెలిపారు. ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కొత్త స్టాఫ్‌వేర్‌ను అభివద్ధి చేయవచ్చునని తెలిపారు. బిటెక్ విద్యార్థులకు ఈవర్క్ షాపు ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు.

## 12 నుంచి వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

వికలాంగుల కోటాలో పెన్షనను పొందుతున్న దష్టి, వినికిడి లోపం కలిగిన లబ్ధిదారులకు ఈనెల 12 నుంచి 19 వరకూ వికలాంగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు.మండలంలో దష్టి లోపంతో పెన్షన్ పొందుతున్న 117 మంది లబ్ధిదారులకు బాపట్ల ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో, వినికిడి లోపంతో పెన్షన్ పొందుతున్న 297 మంది లబ్ధిదారులకు తెనాలి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. లబ్ధిదారులకు వారి గ్రామాల పరిధిలో అధికారులు నోటీసులు అందజేస్తారని తెలిపారు. నోటీసులో పేర్కొన్న నిర్ణీత తేదీ మరియు సమయం ప్రకారం లబ్ధిదారులు వైద్య పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఏ కారణం చేతనైనా పరీక్షలకు హాజరు కాకపోతే వారి పెన్షన్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తారని ఎంపిడిఒ తెలిపారు.

# కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

**ప్రజాశక్తి-బాపట్ల**

కార్పొరేట్లకే అనుకూలంగాఉన్న కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో బాపట్లలోని ఆటోస్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ వల్ల సామాన్యులకు ఉపయోగం లేదని అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికులపై భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బి.బుచ్చిరాజు, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

# లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ నిరసన

**ప్రజాశక్తి-రేపల్లె**

కార్మిక హక్కులను హరించే కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నాడు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందార్, జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, కార్మికులకు ప్రమాదభరితమైన నాలుగు లేబర్ కోడ్స్ ను అమలుచేసే దాని కోసం 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాలు కోడ్, సామాజిక భద్రత కోడ్, వత్తి భద్రత ఆరోగ్యం మరియు నేచర్ అఫ్ వర్క్ కోడ్ తీసుకొచ్చిందన్నారు. కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినా కూడా కార్మిక హక్కులు కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.కష్ణకుమారి, కే.రత్నకుమారి, వై.మేరీమణి, డి.ప్రభాకర్, బి.సురేష్, డి.శ్రీనివాసరావు, యు.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక చికిత్సకే గ్రామీణ వైద్యులు

- హానికర ఔషధాలు ఉంటే చర్యలు
- డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

గ్రామీణ వైద్యులు కేవలం ప్రాథమిక చికిత్స చేయటం వరకే అర్హులని, అంతకు మించి ఎటువంటి చికిత్స చేయరాదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఒంగోలు రెడ్ క్రాస్ సొసైటీ సమావేశ మందిరంలో బుధవారం ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల సంఘ సమావేశం జరిగింది. కార్యక్రమంలో డిఎం,హెచ్‌ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ఔషధ నియంత్రణ విభాగ అదనపు సహాయ సంచాలకులు జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ ప్రాథమిక చికిత్స కేంద్రాలలో కేవలం ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు మాత్రమే ఉండాలన్నారు. ఔషధ నియంత్రణ అదనపు సంచాలకులు జ్యోతి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ఎవరైనా పరిమితికి మించి వైద్యం చేసినా, అనుమతులు లేని ఔషధాలు ఉన్నట్లు గుర్తించినా ఏడు సంవత్సరాల కారాగార శిక్ష, లక్ష రూపాయలు పైబడి జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు , గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు శివయ్య. కార్యదర్శి చంద్రశేఖర్. కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజు. బాలాజీ, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ వెంకటేశ్వర్లు

**వైద్యులు సమయపాలన పాటించాలి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి, సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిఎం,హెచ్‌ఒ సందర్శించి అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించి వైద్యాధికారి, సిబ్బందికి తగిన ఆదేశాలు ఇచ్చారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

# అవగాహనతోనే ప్రమాదాల నివారణ

కలెక్టర్ వెంకటమురళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

రహదారులపై ప్రమాదాల నివారణ అవగాహనతోనే సాధ్యమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా బాపట్ల పట్టణంలో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు సాగిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడి అగ్రభాగాన నిలవడంతో ప్రత్యేకత సంతరించుకుంది. హెల్మెట్ ధారణ–ప్రాణానికి రక్షణ, అతివేగం–పొంచి ఉన్న ప్రమాదం అంటూ పోలీసులు, డ్రైవర్లు ప్లకార్డులు చేతబూని నినదించారు. రవాణా శాఖ సిబ్బంది, పోలీసులు, డ్రైవర్లు కలిసి మానవహారం నిర్వహించారు. అనంతరం డ్రైవర్లతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ప్రమాదాలు నివారించడానికి రహదారి భద్రత నియమాలను పోలీసులు నిత్యం అమలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, బాపట్ల ఆర్డిఓ పిగ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంవీఐలు, పోలీస్ అధికారులు, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి.. ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

# నులిపురుగుల నివారణ మాత్రలివ్వాలి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లాలో 0 నుండి 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ టాబ్లెట్లను తప్పనిసరిగా ఇవ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశం హాలులో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చేపట్టవలసిన చర్యలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో పిల్లలకు నులిపురుగుల మందులను పంపిణీ చేయాలని చెప్పారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న విద్యార్థులు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 8 వరకు దరఖాస్తులకు అవకాశం

**ప్రజాశక్తి-బాపట్ల**

కల్లు గీత కులాలకు సంబంధించి బాపట్ల జిల్లాలో కేటాయించిన మద్యం షాపులకు గానూ దరఖాస్తులు సమర్పించే గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ సహాయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10న బాపట్లలోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ ద్వారా డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

# ఆరు నెలల్లో ఒంగోలు రూపురేఖలు మారుస్తాం..

- వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్
- పలు అభివృద్ధి పనులకు ఒఎంసి కౌన్సిల్ సమావేశం ఆమోదం
- మాట్లాడే అవకాశం ఇవ్వలేదని వైసిపి సభ్యులు వాకౌట్

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

రానున్న ఆరు నెలల్లో ఒంగోలు రూపురేఖలు మారు స్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ(బుజ్జి) అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అజెండాలోని 29 అంశాల మీద చర్చ జరిగింది. అజెండాలోని ఒకటి, మూడు అంశాలు వాయిదా పడగా, 7, 27, 28, 29 అంశాలు రద్దు చేశారు. సమావేశానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ రానున్నది వేసవి కాలం కాబట్టి ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పగటి వేళల్లోనే ప్రజలకు తాగునీరు ఇచ్చేలా గట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయ సిబ్బందికి అంతర్గత బదిలీలు చేపట్టాలని సూచించారు. కొత్త కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల ఇబ్బందులకు గత పాలకుల చేష్టలే కారణమని విమర్శించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమలు విపరీతంగా ఉన్నాయని తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీలు నివాసం ఉండే ప్రాంతాలలోనే ఖర్చు చేయాలని సూచించారు. 190 ఎకరాల విస్తీర్ణం కలిగిన పేర్నమిట్ట చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చాలని సూచించారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్ధన్, అధ్యక్ష స్థానంలో ఇన్‌ఛార్జి మేయర్ బుజ్జి

**రెండు అంశాలు వాయిదా**

అజెండాలో పొందుపరిచిన రెండు అంశాలు వాయిదా పడగా, నాలుగు అంశాలను రద్దు చేశారు. ఊరచెరువులోని ముస్లిం షాధీఖానా లీజుకు ఇచ్చే విషయం మీద చర్చ జరిగింది. ఈవిషయం మీద కమిటి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జనార్ధన్ సూచించడంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు. దశరాజుపల్లి రోడ్డులో ముస్లిముల ఖబరస్తాన్‌కు కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలనే అంశంమీద జరిగిన చర్చలో ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ ఖబరస్తాన్ స్థలం విషయం వివాదంలో ఉందని, తాను ముస్లిం పెద్దలు, ఇతర పెద్దలతో చర్చలు జరుపుతున్నానని వివరించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఆ అంశాన్ని వాయిదా వేశారు. దర్శి పంచాయతీలో పనిచేస్తున్న ఓ పారిశుధ్య కార్మికురాలిని ఒంగోలు కార్పొరేషన్‌లో నియమించేందుకు అనుమతి కోరుతూ అజెండాలో పెట్టడాన్ని టిడిపి కార్పొరేటర్ దాచర్ల రమణయ్య తప్పుపట్టారు. దీంతో ఆ అంశాన్ని సమావేశంలో రద్దు చేశారు. మరో మూడు విషయాలకు సంబంధించి 2025-26 సంవత్సరం బడ్జెట్ ఆమోదం తీసుకున్న తరువాతనే అజెండాలో పెట్టాలని దాచర్ల రమణయ్య సూచించారు. బడ్జెట్ ఆమోదం లేకుండా అజెండాలో ఎలా పెట్టారని డిప్యూటి మేయర్-2 వెలనాటి మాధవరావు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ వెంకటేశ్వరరావు వివరణ ఇచ్చారు. మరోసారి పొరపాటు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్‌బాబు, చింతపల్లి గోపి, యనమల నాగరాజు, బెంగుళూరు నర్సయ్య, నాగభూషణం, శాండిల్యాలు పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు.

**కష్టపడి పనిచేద్దాం: వేమూరి బుజ్జి**

గత నాలుగేళ్లుగా కార్పొరేటర్లు వారివారి డివిజన్‌లలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కష్టపడి పనిచేశారని, రానున్న ఏడాది కాలంలో కూడా అదే విధంగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని సమావేశానికి అధ్యక్షత వహించిన ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి బుజ్జి సూచించారు. మేయర్ గంగాడ సుజాత వ్యక్తిగత పనుల మీద సెలవు పెట్టడంతో డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి బుధవారం నాటి సమావేశానికి అధ్యక్షత వహించారు. తొలిసారి మేయర్ హోదాలో ఆయన సమావేశం నడిపిన తీరును పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అభినందించారు.

**వైసిపి సభ్యులు వాకౌట్...**

సమావేశంలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఏకపక్షంగా అజెండాను ఆమోదించుకుంటున్నారని వైసిపి సభ్యులు సమావేశంలో ఆందోళన చేశారు. ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడాన్ని తప్పుపడుతూ ఆ పార్టీ కార్పొరేటర్లు ఎండి ఇమ్రాన్‌ఖాన్, వెన్నపూస కుమారి, గంగవరపు ప్రవీణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు షేక్ రషీదా సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్షం గొంతునొక్కుతోందని నినాదాలు చేశారు.